8న విద్యుత్తు బీసీ ఉద్యోగుల మహాసభ

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 19వ రాష్ట్ర మహాసభను 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు కే కుమారస్వామి ప్రకటనలో తెలిపారు. ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆడిటోరియంలో నిర్వహించనున్న మహాసభలో 2025 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తామని పేర్కొన్నారు. ఎంపీలు ఈటెల రాజేందర్, ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు వెల్లడించారు.

పల్లెల్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

డీపీవోల సమీక్షలో మంత్రి సీతక్క

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రతి పల్లెనూ ఆదర్శంగా తీర్చిదిద్దాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లిప్తంగా ఉండొద్దని పేర్కొన్నారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని గ్రామీణ మంచినీటి సరఫరా సెంట్రల్ ఆఫీసులో డీపీవోలతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిధుల వినియోగం, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, డైరెక్టర్ శ్రీజన తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సైన్స్ ఎగ్జిబిషన్

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : విద్యార్థుల్లోని సైన్స్ ప్రతిభను వెలికితీసేందుకు, బాలశాస్త్రవేత్తలను గుర్తించేందుకు నిర్వహించే రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను 7నుంచి 9 వరకు నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ప్రకటనలో తెలిపారు. జడ్చర్ల పోలేపల్లి సెజ్‌లోని ఎస్‌వీకేఎస్ స్కూల్‌లో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌కు 830 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరిచిన వారిని జాతీయస్థాయికి ఎంపికచేస్తామని తెలిపారు.

ఎస్సీ కాలనీకి తాగునీటి కష్టాలు

- పది నెలలుగా రాని మిషన్ భగీరథ నీళ్లు
- వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్న కాలనీవాసులు
- ఎంత మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలోని దళితకాలనీలో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

గణపురం, జనవరి 5 : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సొంత మండలమైన గణపురంలోని దళిత కాలనీ ప్రజలు పది నెలలుగా మిషన్ భగీరథ నీళ్లు రాక గోసపడుతున్నారు. అధికారులకు విన్న వించుకుంటున్నా పట్టించుకోవడంతో కిలోమీటర్ల దూరం వెళ్లి.. ప్రైవేట్ బోరుబావుల నుంచి బిందెలతో తెచ్చుకొని దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఈ విషయమై దళితకాలనీ మహిళలు సంబంధిత అధికారులకు గోడును విన్నవించుకోగా, ఎస్సీ కాలనీకి పైపులైన్ సమస్య ఉందని, పూర్తి కాగానే నీళ్లిస్తామని నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పది నెలలుగా తాగునీళ్లు లేక వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నామని, స్నానంతోపాటు దుస్తులు శుభ్రం చేసుకోవడానికి సైతం వ్యవసాయ బోర్లపైనే ఆధారపడాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. ఇప్పటికైనా తమ గోడు విని, దాహార్తిని తీర్చాలని కాలనీప్రజలు వేడుకుంటున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు

పది నెలలుగా మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి భగీరథ నీళ్లు రావడంలేదు. అనేకసార్లు గ్రామపంచాయతీ కార్యదర్శి, మిషన్ భగీరథ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దళిత కాలనీ ప్రజల సమస్యలను పరిష్కరించాలి.

- కట్ల ప్రశాంతీశంకరయ్య, మాజీ సర్పంచ్

కరీంనగర్ జిల్లా రేకుర్తి కంటి దవాఖానలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్

నేత్ర వైద్యశాలకు హైకోర్టు న్యాయమూర్తి విరాళం

విద్యానగర్, జనవరి 5: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రేకుర్తిలోని డాక్టర్ మడేకర్ లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఉదార నేత్ర వైద్యశాలకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఆదివారం దవాఖానను సందర్శించిన ఆయన సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. పేదప్రజల కంటి ఆపరేషన్ల కోసం తన తండ్రి, టైక్స్‌టైల్స్ అండ్ హ్యాండ్లూమ్స్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు పేరిట రూ.లక్ష విరాళంగా అందిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ మలేషియా అసోసియేషన్ అధ్యక్షుడు సైదం తిరుపతి రూ.50 వేల విరాళం అందిస్తున్నట్టు ప్రకటించారు. పేద ప్రజలకు అండగా నిలిచేందుకు ముందుకు వచ్చిన జస్టిస్ వేణుగోపాల్, తిరుపతిని దవాఖాన యాజమాన్యం సత్కరించింది.

పర్యాటక పటంలో కోటగుళ్లు, గణపసముద్రానికి చోటు

- టూరిజం శాఖ విడుదల చేసిన వీడియోలో స్థానం
- ప్రపంచవ్యాప్తంగా పర్యాటకశాఖ ప్రచారం

గణపురం, జనవరి 5 : పర్యాటకులను ఆకర్షించేందుకు పర్యాటక శాఖ చిత్రీకరించిన వీడియోలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలోని కాకతీయులు నిర్మించిన కోటగుళ్లు, గణపసముద్రం సరస్సు మత్తడికి చోటుదక్కింది. పర్యాటక అందాలు, వారసత్వ కట్టడాలుగా పేరొందిన గణపురం కోటగుళ్లు, గణప సముద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారి సముచిత స్థానం కల్పించింది. రామప్ప దేవాలయం, భూదాన్ పోచంపల్లి, యాదగిరిగుట్ట, పాండవుల గుట్ట, నాగార్జునసాగర్, జోడేఘాట్‌లోయ, నల్లమల, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కిన్నెరసాని వైల్డ్ లైఫ్ శాంక్చురీ ప్రాజెక్టు, కుమ్రంభీం ప్రాజెక్టు, ఎస్సారెస్పీ (నందిపేట) వంటివి వీడియోలో ఉన్నాయి. సుమారు నిమిషం నిడివిగల వీడియోలో వీటిని పొందుపరిచారు.

డిప్యూటీ సీఎం సభ అట్టర్‌ప్లాఫ్

- భట్టి మాట్లాడకుముందే వెళ్లిపోయిన జనం
- ఖాళీ కుర్చీలతో సభ వెలవెలా
- జనాలను ఆపే ప్రయత్నం చేసిన పోలీసులు

గీసుగొండ, జనవరి 5 : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదివారం గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్లలో నిర్వహించిన సభ అట్టర్ ప్లాఫ్ అయింది. విద్యుత్ ఉపకేంద్రాల శంకుస్థాపన అనంతరం నిర్వహించిన నియోజకవర్గస్థాయి బహిరంగ సభ జనాలు లేక వెలవెలబోయింది. డిప్యూటీ సీఎం సభను విజయవంతం చేయడానికి నాలుగు రోజులుగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నియోజకవర్గంలోని 6 మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. సభకు ప్రజలను భారీగా తరలించాలని స్థానిక నాయకులకు టార్గెట్లు పెట్టారు. నియోజకవర్గం నుంచి 4వేలమంది సభకు వచ్చి ఉంటారని స్థానిక నాయకులు చెబుతున్నారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతుండగానే జనాలు వెళ్లిపోవడం మొదలు పెట్టారు. డిప్యూటీ సీఎం ప్రసంగించే సమయంలో ప్రజలంతా వెళ్లిపోయారు. పోలీసులు ప్రజలను ఆపే ప్రయత్నం చేసినా జనం మాత్రం ఆగలేదు. డిప్యూటీ సీఎం మాట్లాడుతుండగానే సభ ప్రాంగణమంతా ఖాళీ అయ్యింది. తన ఎకరం 16 గంటల భూమిని సబ్‌స్టేషన్ కోసం లాక్కున్నారని, మొగిలిచెర్ల గ్రామానికి చెందిన మహిళా రైతు మేడ వరలక్ష్మి డిప్యూటీ సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని బయటకు పంపారు.

ఎల్‌ఈడీ స్క్రీన్‌లో డిప్యూటీ సీఎం ప్రసంగం, ఎదురుగా కనిపిస్తున్న ఖాళీ కుర్చీలు

ఉచిత కంటి వైద్యశిబిరంలో డ్రైవర్‌కు అద్దాలు అందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి. చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

రోడ్డు ప్రమాదాల నివారణకు చొరవ చూపాలి

- లారీ డ్రైవర్లకు మంత్రి కోమటిరెడ్డి సూచన
- హైవేపై డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

చిట్యాల, జనవరి 5 : జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. జాతీయ రహదారిపై వెళ్లే భారీ వాహన డ్రైవర్ల కోసం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టి మర్తి వద్ద ఉన్న ఓ దాబా వద్ద ఆదివారం ఉచిత కంటి పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ – విజయవాడ రహదారిపై రోజూ 70 నుంచి 80 వేల వాహనాలు తిరుగుతున్నాయని, ఈ రహదారిపై ప్రమాదాలు నివారించేందుకు మొట్టమొదటిసారిగా జిల్లా యంత్రాంగం డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎవరికైనా దృష్టిలోపం ఉంటే ఈ శిబిరంలో పరీక్షలు జరిపి తక్షణమే కళ్లద్దాలు ఇస్తున్నారని తెలిపారు. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిని ఆరు లేన్లుగా మార్చేందుకు మే నెల చివరి నాటికి టెండర్లు పూర్తి చేసి, రెండు సంపత్సరాల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

అబూజ్‌మడ్ అడవుల్లో ఎదురుకాల్పులు

- నలుగురు మావోయిస్టులు హతం
- డీఆర్‌జీ హెడ్ కానిస్టేబుల్ మృతి

ఎదురుకాల్పుల్లో మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ సన్ను కరమ్ (ఫైల్)

కొత్తగూడెం క్రైం, జనవరి 5: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో 'కగార్' వేట వేగవంతమవుతోంది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భద్రతా దళాలు దూసుకెళ్తున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు నేలకొరిగారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ – దంతేవాడ జిల్లాల సరిహద్దుల్లో ఉన్న అబూజ్‌మడ్ అడవుల్లో నాలుగు జిల్లాల భద్రతా దళాలు సెర్చింగ్ యాంటీ నక్సల్ ఆపరేషన్స్ నిర్వహించాయి. నారాయణ్‌పూర్ జిల్లాతోపాటు దంతేవాడ, కొండగావ్, జగ్దల్‌పూర్ జిల్లాల రిజర్వు గార్డు (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. ఈ క్రమంలో వారికి మావోయిస్టులు తారసపడి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా దళాలు ఎదురుకాల్పులు ప్రారంభించాయి. ఇరువర్గాల మధ్య సుమారు గంటన్నరపాటు భీకరపోరు జరిగినట్లు తెలుస్తోంది. భద్రతా దళాల ధాటికి తాళలేకపోయిన మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన మార్గంలో పారిపోయారు. ఈ కాల్పుల్లో డీఆర్‌జీకి చెందిన హెడ్ కానిస్టేబుల్ సన్ను కరమ్ మృతిచెందాడు. కాల్పుల విరమణ అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని గాలింపులు చేపట్టాయి. ఈ క్రమంలో ఎదురుకాల్పుల్లో మృతిచెందిన నలుగురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు, ఏకే-47, ఎస్ఎల్ఆర్ వంటి ఇతరత్ర ఆయుధాలను జవాన్లు స్వాధీనపర్చుకున్నారు. ఎదురుకాల్పుల జరిగిన ప్రాంతానికి ఎయిర్‌లిఫ్టర్ ఎంఐ-17 చాపర్ ద్వారా బ్యాకప్‌గా అదనపు భద్రతా దళాలు చేరుకున్నాయి. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో యుద్ధ వాతావరణం అలుముకుంది. మావోయిస్టుల ఇలాకా అయిన అబూజ్‌మడ్ అడవుల్లో పోలీస్ ఉన్నతాధికారులు హై అలెర్ట్ ప్రకటించారు. ప్రస్తుతం ఆ ప్రాంతానికి చేరుకున్న అదనపు బలగాలు అడవులను విస్తృతంగా జల్లెడపడుతున్నాయి.

కొత్తగూడెంలో విద్యార్థి ఆత్మహత్య

- స్పెషల్ క్లాసులు, ర్యాంకుల కోసం కళాశాల యాజమాన్యం ఒత్తిడి
- కాలేజీకి హాజరుకాకుంటే హాల్‌టికెట్ ఇవ్వబోమంటూ బెదిరింపులు
- ఒత్తిడి తాళ లేక ఇంటర్ సెకండియర్ విద్యార్థి బలవన్మరణం
- తల్లిండ్రులు ఆందోళన.. కళాశాలను మూసివేయాలని డిమాండ్

శనగ రాంపవర్ (ఫైల్), విద్యార్థి మృతదేహంపై పడి రోదిస్తున్న తండ్రి లక్ష్మణ్

చుంచుపల్లి, జనవరి 5: స్పెషల్ క్లాసులు, ర్యాంకుల పేరిట కళాశాల యాజమాన్యం పెడుతున్న వేధింపులను తాళలేక ఓ ఇంటర్ సెకండియర్ విద్యార్థి ఆత్మహత్య చేసున్నాడు. ఈ ఘటన భద్రాద్రి జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్‌కు చెందిన శనగ లక్ష్మణ్ కుమారుడు రాంపవర్ (18) స్థానిక లక్ష్మీదేవిపల్లిలోని శ్రీ నలంద జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. ఫస్టియర్‌లో ఎంపీసీలో 464 మార్కులు వచ్చాయి. అయితే, రాంపవర్ విద్యానగర్ కాలనీలోని తన నానమ్మ, తాతయ్య ఇంటి వద్దనే ఉంటూ కాలేజీకి వెళ్తున్నాడు. అయితే, మంచిగా చదివి విద్యార్థులను కళాశాల బాధ్యులు సపరేట్ బ్యాచ్ తయారుచేశారు. వారికి ఉదయం 6 నుంచి సాయంత్రం 8 గంటల వరకు ప్రత్యేక క్లాసులు పెట్టి కాలేజీలోనే చదివిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు మానసికంగా, శారీరకంగా అనేక ఒత్తిడులను ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని కొందరు తల్లిదండ్రులు కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన యాజమాన్య బాధ్యులు పట్టించుకోలేదు. పైగా కాలేజీ విషయాలు తల్లిదండ్రులకు చెబుతున్నారంటూ కళాశాలలో ఎగతాళి చేస్తున్నారు. ఈ క్రమంలో రాంపవర్ కూడా ఇటీవల మనోస్థైర్యాన్ని కోల్పోయి కాస్త కుంగిపోయాడు. దీంతో వారం రోజులుగా కళాశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండి చదువుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో కళాశాల బాధ్యులు ఇటీవల పలుమార్లు సదరు విద్యార్థికి, అతడి తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. కాలేజీకి తప్పకుండా రావాల్సిందేనని, లేకుంటే హాల్ టికెట్ ఇవ్వబోమని స్పష్టం చేశారు. దీంతో తీవ్రమైన ఒత్తిడికి గురైన విద్యార్థి రాంపవర్ వీక్లీ ఎగ్జామ్ కోసం శనివారం అర్ధరాత్రి ఒంటి గంట (తెల్లవారితే ఆదివారం) వరకూ చదువుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తగూడెంలో ఏరియా ఆసుపత్రిలోని కుమారుడి మృతదేహం వద్ద తల్లిదండ్రులు, కుటుంసభ్యులు బోరున విలపించారు. కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, కళాశాలను వెంటనే మూసివేయాలని, ఇలాంటి ఘటనలు పురావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు చుంచుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ ఘటనపై ఎస్ఐ రవికుమార్ స్పందిస్తూ.. విద్యార్థి రాంపవర్ కళాశాలకు వెళ్లని కారణంగా కాలేజీ బాధ్యులు అతడిని మందలించారని, దీంతో సదరు విద్యార్థి మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని తమ ప్రాథమిక విచారణలో తెలిసిందని అన్నారు.

ఆరోపణలు అవాస్తవం: చైతన్య, సీఈవో, నలంద కాలేజీ, కొత్తగూడెం

గడిచిన 12 రోజుల్లో సదరు విద్యార్థి ఒక్క రోజు మాత్రమే కళాశాలకు వచ్చాచని, 11 రోజులుగా కాలేజీకి రానేలేదని కళాశాల యాజమాన్య బాధ్యులు తెలిపారు. తామేమీ ఆ విద్యార్థిని వేధించడం లేదని తెలిపారు. విద్యార్థి కుటుంబ సభ్యులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని వివరణ ఇచ్చారు.

ఖమ్మంలో ఆర్గానిక్ మేళా

మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మం/ ఖమ్మం వ్యవసాయం, జనవరి 5 : ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్(వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్)లో గ్రామభారతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆర్గానిక్ మేళాను ఆదివారం ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఖమ్మంలో ఈ మేళా ప్రతినెలా మొదటి ఆదివారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉభయ రాష్ట్రాల రైతులు సేంద్రియ పద్ధతిలో పండించిన ఆర్గానిక్ పంట ఉత్పత్తులను స్టాల్స్‌లో పెట్టి అమ్మకాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నల్లమల వెంకటేశ్వరరావు, కుతుంబాక మాధవి, నరేంద్ర స్వరూప్, బసవ పున్నయ్య నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కరాటే పోటీలు ప్రారంభం..

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని షాదీఖానాలో పల్లా జాన్‌రాములు మెమోరియల్ నేషనల్ కరాటే చాంపియన్ షిప్-2025ను ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ ఆదివారం ప్రారంభించారు. నేటి సమాజంలో ఆడపిల్లలు ఆత్మరక్షణ కోసం కరాటే విద్య తప్పకుండా నేర్చుకోవాలని సూచించారు. డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార ముక్తార్, టోర్నమెంట్ ఆర్గనైజేషన్ టీం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిళ్లగూడెం, జనవరి 5 : ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు సోమవారం అంతరాయం ఏర్పడుతుందని టీజీఎస్పీడీసీఎల్ ఖమ్మం టౌన్-1 ఏడీఈ నాగార్జున ఆదివారం ప్రకటనలో తెలిపారు. దానవాయిగూడెం 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ సారధి నగర్ ఫీడర్‌లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు లైన్ల మరమ్మతుల్లో భాగంగా చెట్లకొమ్మలు కొట్టడం కోసం అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. దీనికారణంగా సారధినగర్, రామాలయం వీధి, సాయిబాబా టెంపుల్ లైన్, బీరప్ప టెంపుల్, పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, జూబ్లీ స్కూల్, జూబ్లీపుర ప్రాంతాల్లో ఉండే వినియోగదారులు సహకరించాలని కోరారు. అదేవిధంగా బుర్హాన్‌పురం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ రామాయలయం, మామిళ్లగూడెం ఫీడర్‌లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మలు తొలగిచడం కారణంగా అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. దీని కారణంగా మామిళ్లగూడెం, ఎల్ఐజీ మామిళ్లగూడెం, బుర్హాన్‌పురం పరిధిలో ఉన్న వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

రౌడీషీటర్ అరెస్టు

సీఐ బాలకృష్ణ

మామిళ్లగూడెం, జనవరి 5 : చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న రౌడీషీటర్ పేరెల్లి ప్రవీణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 డిసెంబర్ 14న ఖమ్మం ఇందిరానగర్ ప్రాంతంలో రోడ్డును ఆక్రమించి వేసిన రేకులషెడ్‌ను విధి నిర్వహణలో భాగంగా జేసీబీ సహాయంతో తొలగించి వెళ్తున్న నగరపాలక సంస్థ సిబ్బందిపై ఎన్టీఆర్ సర్కిల్ వద్ద అడ్డుకుని దౌర్జన్యంగా దాడులు చేసి ఐరన్‌రాడ్‌తో జేసీబీ అద్దాలను ప్రవీణ్, అతడి సోదరుడు రవికుమార్ ధ్వసం చేశారు. ఈ ఘటనపై సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. అప్పటినుంచి పరారీలో ఉన్న నిందితుడు భూకబ్జాలు చేస్తూ.. బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు డిమాండ్ చేస్తూ వరుస నేరాలకు పాల్పడుతున్నాడు. దీంతో సెక్షన్ 111 బీఎన్ఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని తెలిపారు. గతంలో ఓ హత్య కేసుతోపాటు దోపిడీ, దౌర్జన్యాలు, హత్యాయత్నం వంటి మూడు కేసుల్లో జీవితఖైదు శిక్ష అనుభవిస్తూ సత్ప్రవర్తనతో జైలు నుంచి విడుదలై తిరిగి నేర ప్రవృత్తి కొనసాగిస్తున్నాడని తెలిపారు. గతంలో ఇతడిపై ఖమ్మం, నల్లగొండ జిల్లాలో నమోదైన సుమారు 30 కేసుల్లో 21 కేసుల్లో అరెస్టు అయి జైలుకు వెళ్లి బెయిల్‌పై తిరుగుతున్నాడని తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

మామిళ్లగూడెం, జనవరి 5 : జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరంలో పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలు కొత్తగా, రెన్యువల్‌లో నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని ఎస్సీ అభివృద్ధిశాఖ జిల్లా ఉప సంచాలకులు కస్తాల సత్యనారాయణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు ఈ పాస్ వెబ్‌సైట్‌లో సకాలంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఎస్సీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ నూతన మార్గదర్శకాల ప్రకారం ప్రతి విద్యార్థి ఆధార్ సీడింగ్ కలిగిన బ్యాంక్ అకౌంట్ కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల ఉపకార వేతనాల దరఖాస్తులు డిజిటల్ సిగ్నేచర్ ద్వారానే జిల్లా అధికారి లాగిన్‌కు పార్వార్డ్ చేయాలని డీడీ ఆ ప్రకటనలో తెలిపారు.

ఒరేయ్ యూసుఫ్.. బతికే ఉన్నావురా..!

'ఎవరీ యూసుఫ్..? బతికే ఉండడమేమిటి..?!'- ఇది తెలియాలంటే.. బూర్గంపహాడ్ వెళ్లాలి. గత 16 ఏళ్లుగా ఏటేటా కొనసాగుతున్న 'యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్' గురించి తెలుసుకోవాలి. వీలయితే.. ఈ నెల 10న జరిగే ఆ టోర్నమెంటును తిలకించాలి. ఇంతకీ, ఎవరీ యూసుఫ్..?!

యూసుఫ్ టోర్నీలో ఆడిన ఐపీఎల్ క్రీడాకారుడు అయ్యప్పను సత్కరిస్తున్న నిర్వాహకులు (ఫైల్)

బూర్గంపహాడ్, జనవరి 5: యూసుఫ్, సోహెల్‌పాషా, గోనెల నాని, భజన సతీష్, గోనెల సర్వేశ్వరరావు, అబ్దుల్ సలీమ్, కన్నెబోయిన సారథి, సత్తిపండు, కిషోర్, మందా ప్రసాద్.. బూర్గంపాడుకు చెందిన వీళ్లంతా చిన్ననాటి స్నేహితులు. వయసుతోపాటు వీళ్ల మధ్య స్నేహం మరింతగా పెరిగింది. వీళ్ల స్నేహానుబంధాన్ని చూసిన విధికి కన్ను కుట్టిందేమో..! 2009లో జరిగిన రోడ్డు ప్రమాదంలో యూసుఫ్ ప్రాణాలు కోల్పోయాడు. దీనిని ఆ మిత్ర బృందం తట్టుకోలేకపోయింది. 'యూసుఫ్ చనిపోలేదు. మనలోనే ఉన్నాడు.. మనతోనే ఉంటాడు-ఉండాలి' అనుకున్నారు. తమ మిత్రుడిని 'సజీవం'గా నిలుపుకునేందుకు.. అతడి పేరిట ఏదేని కార్యక్రమం చేపట్టాలనుకున్నారు. అలా ఆ ఆలోచన నుంచి ఉద్భవించిందే.. 'యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్'..!! యూసుఫ్.. మంచి క్రికెటర్. చక్కగా ఆడేవాడు. అందుకే, అతడికి ఇష్టమైన క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా, అదే సంవత్సరంలో టోర్నమెంట్ నిర్వహించారు. అప్పటి నుంచి ఇప్పటివరకూ 16 ఏళ్లపాటు క్రమం తప్పకుండా కొనసాగించారు. 17వ టోర్నమెంటును ఈ నెల 10వ తేదీన నిర్వహించేందుకు ఆ మిత్ర బృందం ఏర్పాట్లు చేస్తున్నది. ఈ మిత్ర బృందంలో కొందరు మాత్రమే స్థానికంగా ఉన్నారు. మిగతా వారు ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. అయినప్పటికీ, వారంతా ప్రతి ఏటా ఈ యూసుఫ్ టోర్నమెంట్ కోసం తప్పనిసరిగా బూర్గంపహాడ్ వస్తుంటారు. ఐపీఎల్ క్రీడాకారుడు బండారు అయ్యప్ప.. 2022లో కొత్తగూడెం టీం నుంచి యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నీలో ఆడాడు. యూసుఫ్ మిత్ర బృందం గురించి మరో మాట కూడా చెప్పుకోవాలి. భౌతికంగా దూరమైన తమ మిత్రుడిని స్మరించుకుంటూ వివిధ రూపాల్లో సేవాకార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు తదితరాలను అందిస్తున్నారు. గోదావరి వరద ముంపు బాధితులను ఆదుకున్నారు. ఇలా తమ మిత్రుడిని మదిలో సజీవంగా ఉంచుకుంటున్నారు. అతడు గుర్తుకొచ్చినప్పుడల్లా వారు మనసులో ఇలా అనుకోకుండా ఉండలేకపోతున్నారు

– "ఒరేయ్ యూసుఫ్.. బతికే ఉన్నావురా..!"